కథా నిలయం
5481
శ్రీకాకుళం

తీపి+పులుపు+చేదు+వగరు

# జీవితం

అప్పుడే తెలతెలవారుతోంది. లోకం చీకటి ముసుగుని తొలగించుకుని, వెలుగుని కప్పుకుంటోంది. మంచుతెరల్ని చేదించుకొంటూ సూర్యుని బంగారు కిరణాలు దూసుకొస్తున్నాయి.

ఆతృతగా లేచింది అన్నపూర్ణ. రాత్రి పడుకున్నప్పుడు పెందలాడే మేల్కోవాలని అనుకుంది. కాని, అలా లేవలేకపోయినందుకు తనను తానే తిట్టుకుంది. ఎదురుగా ఉన్న వేంకటేశ్వరస్వామి ఫొటోకేసి చూస్తూ ముకుళిత హస్తలతో మనసారా నమస్కరించి, మెళ్లోని మంగళసూత్రాన్ని భక్తితో కళ్ళకి అద్దుకుంది. 'ఏవండి.. ఏవండి.. లేవండి " అంటూ మంచం మీద పడుకున్న భర్తని తట్టి మరీ లేపింది అన్నపూర్ణ.

" అప్పుడే ఎందుకు నిద్రలేపావ్ పూర్ణా ? " అన్నాడు గోపాలం ఆవులిస్తూ,

" ఏవిటండీ తెలీనట్టు మాట్లాడతారు ? ఇవ్వాళ్ళ 'ఉగాది' పండుగ కదండీ, మర్చిపోయారా ఈ రోజు ఆనందంగా గడిపేస్తే; ఈ సంవత్సరమంతా ఆనందంగా వుంటారని చెబుతారు పెద్దలు. లేవండి, లేవండి, తొందరగా కాలకృత్యాలు తీర్చుకుని, స్నానం చేసిరండి. పెరట్లో వున్న వేపపువ్వు, మామిడి కాయలు, తీసుకొస్తే ఉగాది పచ్చడి తయారు చేస్తాను. లేవండి." అంది అన్నపూర్ణ.

గోపాలంకి నవ్వు ఆగక, నవ్వేశాడు. భర్త అలా నవ్వుతూ వుంటే, అన్నపూర్ణకి ఒళ్ళు మండిపోయింది. 'ఎందుకండీ అలా నవ్వుతారు ??" అంది పుడుకుమొత్తనంగా " ఈ రోజు నవ్వుకుంటూ వుంటే సంవత్సరం పొడుగునా నవ్వుతూ ఉంటాం కదా పూర్ణా." అన్నాడు గోపాలం.

" మీకు అంతా వెటకారంగానే వుంటుందిలెండి " చిన్నబుచ్చుకుంది అన్నపూర్ణ.

"వెటకారం కాదు పూర్ణా. అదంతా పిచ్చినమ్మకం. అందరూ ఆనందంగా ఉంటే, ప్రపంచంలో ఇంక బాధలకే చోటు వుండదు కదా !" సన్నగా నవ్వుతూ అన్నాడు. "ఏమోనండీ ! అవన్నీ నాకు తెలీవు. జనం చెప్పుకున్న విషయాన్నే నేనూ చెప్పాను. మీరు లేచి పిల్లల్ని లేపండి. ఈ లోగా, నేను నా పనులన్నీ పూర్తి చేసుకుని వస్తాను" అంటూ, హడావిడిగా అక్కణ్ణించి వెళ్ళిపోయింది అన్నపూర్ణ.

గోపాలం, బరువుగా ఓ నిట్టూర్పు విడుస్తూ లేచి, పిల్లల్నిద్దర్నీ లేపాడు.

గోపాలం కాలకృత్యాలు తీర్చుకుని, స్నానం ముగించాడు. అప్పటికే అన్నపూర్ణ స్నానం చేసి వచ్చింది. భార్య చేత మళ్ళీ చెప్పించుకోకుండా, పెరట్లోకి దారి తీసి, వేపపువ్వు, నాలుగు మామిడికాయలు కోసుకుని వచ్చి, వాటిని భార్యకు అందించాడు.

"మీరిద్దరూ స్నానం చేద్దురుగాని రండ్రర్రా !' 'పిల్లల్ని ఉద్దేశించి కేక వేసింది అన్నపూర్ణ. ఆరేళ్ళ అపర్ణ, నాలుగేళ్ళ హరి, పరిగెత్తుకుంటూ తల్లి దగ్గరకు వెళ్ళారు. వాళ్ళిద్దరికీ స్నానం చేయించింది అన్నపూర్ణ.

పిల్లల కోసం వుతికి మడతపెట్టిన బట్టలు తీసింది అన్నపూర్ణ.

"అమ్మా ఈ రోజు 'ఉగాది' కదా ! అందరూ కొత్తబట్టలు వేసుకుంటారు. మాకూ కొత్తబట్టలు వెయ్యమ్మా " అంది అపర్ణ.

అన్నపూర్ణ, గతుక్కుమంది ఆమె హృదయంలో ఎక్కడో చుర్రుమంది. ఆమె మొహం కళావిహీనమయింది. కళ్ళు చెమర్చినయ్. ఆ కళ్ళల్లో బాధతప్త భావాలెన్నో.. !

కాస్తంత దూరంలో వున్న గోపాలం కూతురు మాటలు విన్నాడు. అతని హృదయం తరుక్కుపోయింది. బాధగా మూలిగింది. అతని నయనాల్లో, అప్రయత్నంగా అశ్రువులు గూడుకట్టినాయ్. ఆ పల్లెలో బడిపంతులుగా బతుకు నీడుస్తోన్న తనకి, సకాలంలో జీతాలు దొరక్క, ఎప్పుడూ ఇబ్బంది తప్పడంలేదు. ఇటువంటి పండుగలు వస్తే,మరీ బాధగా వుంటుంది. కాని ఏం చెయ్యగలడు తను ? తన దురదృష్టం మీద తప్పించి, ఇంకెవ్వరి మీదా కోపాన్ని వెళ్ళగక్కలేడు. .. అతని లోని ఆలోచనలు, అతనిలోనే సమసిపోయినయ్.

భర్తమోహం చూసిన అన్నపూర్ణకి, అతనిలోని బాధ, ఆవేదన, అవగతమయ్యాయి. ఆయనలా తానూ ఆవేదనతో కృంగిపోతే ఎట్లా ?' 'ఉగాది' పండుగ అని మొదట్లో వూరికే సంబరపడిపోయింది . కాని... కాని... ఇప్పుడా సంతోషం తమ కళ్ళల్లో కన్నీరుగా మారింది. 'కొత్త సంవత్సరం' ఎవరికో కొందరు అదృష్టవంతులకే స్వంతమనుకుంది. తమలాంటి వారికి మాత్రం పాత సంవత్సరనమే ! ఉగాది పండుగ కాదు... కేవలం 'ఉగాది' మాత్రమే ! అయినా సరే - పిల్లల సరదాకి కళ్ళెం వెయ్యకూడదనుకుంది.

"అమ్మా అపర్ణా, కొత్తబట్టలు దర్జీవాడు ఇంకా ఇవ్వలేదమ్మా. ప్రస్తుతానికి ఈ బట్టలు వేసుకోండి. ఎంచక్కా వున్నాయో చూశారా ? బట్టలు వేసుకున్నాక, ఉగాది పచ్చడి పెడతాను. తిందురుగాని. మధ్యాహ్నం పరమాన్నం చేస్తాం. ఏం ?" అంటూ పిల్లల్ని మాటలతో మైమరిపించి, ఇద్దరికీ బట్టలు వేసింది అన్నపూర్ణ.

"పదండి, ఉగాది పచ్చడి పెడతాను' అంటూ వాళ్ళని తనతో పాటు తీసుకుపోయింది అన్నపూర్ణ.

గోపాలం కళ్ళొత్తుకున్నాడు. నిజంగా అన్నపూర్ణలాంటి సహధర్మచారిణి లభించడం, తన అదృష్టమే, తనని వూరికే వేపుకు తినకుండా, పరిస్థితుల్ని, తనని, అర్థం చేసుకున్న ఇల్లాలామె ! అనుకున్నాడు మనసులో.

✪✪✪

ఆ రోజు సాయంత్రం నాలుగ్గంటలకి, రామాలయంలో వూరి పెద్దల సమక్షంలో పంచాంగం చదివి వినిపించాల్సింది, గోపాలమే ! అది ఆనవాయితీ, అందుకని క్రితం రోజు కొని తెచ్చిన కొత్త పంచాంగాన్ని తీసి, కళ్ళకి అద్దుకుని, పుటలు తిరిగేస్తున్నాడు గోపాలం.

"నమస్కారం మేష్టారూ" అంటూ వచ్చాడు రాఘవ.

రాఘవ, ఆ వూళ్ళోని ఓ మోతుబరి రైతు కొడుకు. పన్నెండేళ్ళుంటాయి. కొత్త బట్టల్లో, ఎంతో ఠీవిగా, అందంగా అగుపిస్తున్నాడు. అతడి మొహంలో కొత్త తేజస్సు ఏదో తళ్ళుక్కుమంటోంది. అతని వెంట వాళ్ళ నౌకరు పెద్ద పళ్ళెంలో బియ్యం, పప్పులు, కూరగాయలు పళ్ళు తీసుకుని వచ్చాడు.

రాఘవని చూసి, గోపాలం ఎంతో మురిసిపోయాడు. అతడు తన శిష్యుడు. శ్రద్ధగా చదుకుంటున్నాడు. వాడు తప్పకుండా పైకొస్తాడు అనుకున్నాడు లోలోన. " రా బాబూ రాఘవా" ఆప్యాంగా అన్నాడు గోపాలం.

రాఘవ, సన్నని నవ్వు వెదజల్లాడు. ఆ నవ్వు ఎంతో నిర్మలంగా, స్వచ్ఛంగా వుంది.

" మేష్టారూ, ఇవ్వాళ ఉగాది కదా, అంటే కొత్త సంవత్సరం ఆరంభం కదా ! నన్ను ఆశీర్వదించండి" చిలక పలుకుల్లా చెప్పాడు రాఘవ.

రాఘవ మాటలు, లేతమామిడి చిగుళ్ళను ఆస్వాదిస్తూ ' కుహూ... కుహూ' అని ఎలుగెత్తి కమ్మగా, శ్రావ్యంగా ఆలపించే కోయిల పాటలా వినిపించాయి గోపాలం చెవులకి, అతని కళ్ళల్లో ఆనందభాష్పాలు మెరిసినాయ్.

అప్పుడే అన్నపూర్ణ అక్కడికి వచ్చింది. రాఘవని చూసి మురిసిపోయింది. తమ పిల్లలకి తాము కొత్తబట్టలు ఇవ్వలేకపోయామన్న బాధ, ఆమెలో లేకపోలేదు. అయినా , ఆ బాధని అంతరంగపుటడుగున తొక్కేసింది. మధ్య తరగతి మహిళ కదా ! తెచ్చిపెట్టుకున్న మందహాసాన్ని పెదాలపై చిందించింది.

" అన్నపూర్ణా, రాఘవ మన ఆశీస్సులు కోరుతూ మనింటికొచ్చాడు. ఈ రోజుల్లో ఇటువంటి

గురుభక్తి గల శిష్యులు, ఎంతమంది ఉంటారు చెప్పు ? నువ్విలా రా, వచ్చి నా పక్కన నిల్చో" అన్నాడు గోపాలం.

అన్నపూర్ణ, భర్తకి ఎడమవేపు వచ్చి నిల్చుంది. ఆ ఇరువురూ ఆ క్షణంలో పార్వతీపరమేశ్వరుల్లా రాఘవ దృష్టికి గోచరించారు. ఆ లేత మనసులో, భక్తిభావం ఇనుమడించింది. వినమ్రుడై, వాళ్ళిద్దరికీ పాదాభివందనం చేశాడు రాఘవ. గోపాలం దంపతులు, ఆ చిరంజీవిని మనసారా దీవించారు. అదే తరుణంలో రాఘవ, జేబులోంచి రెండు వంద రూపాయల నోట్లు తీసి మేష్టారి పాదాల ముందుంచి నమస్కరించాడు.

నివ్వెరపోతూ కంగారుపడ్డాడు గోపాలం " బాబూ రాఘవా ! డబ్బు, లక్ష్మితో సమానం, నా పాదాల ముందుంచడం అపచారం. తీసేయ్ బాబూ' గద్గదిక స్వరంతో అన్నాడు గోపాలం.

'మేష్టారూ, కొత్త సంవత్సరం సందర్భంగా మా నాన్నగారు ఈ కానుకలు పంపించారు తీసుకోండి' అంటూ ఆ రెండువందల నోట్లు తీసి, మేష్టారు చేతిలో పెట్టి నమస్కరించాడు రాఘవ.

గోపాలం దంపతులు రాఘవని అక్కున జేర్చుకుని, మనసారా దీవించారు.

" అలా కూచో నాయనా' అన్నాడు గోపాలం.

రాఘవ, అక్కడ వేసి వున్న చాపమీద ఆశీసునడయ్యాడు. రాఘవతో వచ్చిన నౌకరు, తాను తీసుకొచ్చిన పెద్ద పళ్ళెంతో వస్తువుల్ని అన్నపూర్ణకి అందించాడు. సజల నేత్రాలతో అందుకుంది, అన్నపూర్ణ. ఎప్పుడేం జరుగుతుందో ఎవ్వరూ చెప్పలేరనడానికి, ఈ సంఘటనే నిదర్శనమనుకుంది - అన్నపూర్ణ.

" వీరయ్యా.. " నౌకర్ని ఉద్దేశించి అన్నాడు గోపాలం.

" చెప్పండయ్యగారూ...' సవినయంగా చేతులు కట్టుకుంటూ నిల్చుని అన్నాడు వీరయ్య.

"అయ్యగారితో చెప్పు, రాఘవని నేను తీసుకొస్తానని"

" అలాగేనండయ్యా" నమస్కరిస్తూ నిష్క్రమించాడు వీరయ్య.

అన్నపూర్ణ, ఉగాది పచ్చడిని ఆకుల్లో వేసి తెచ్చి, భర్తకీ, రాఘవకీ ఇచ్చింది. రాఘవ ఆ పచ్చడ్ని తింటూ - " మేష్టారూ. ఈ పచ్చడ్ని అందరూ ఇలాగే చేస్తారు కదా, దీని అర్థం ఏమిటి ?" ప్రశ్నించాడు.

ఆ చిరంజీవి వేసిన ప్రశ్నకి గోపాలం చాలా ఆనందించాడు. తెలుసుకోవాలన్న ఆసక్తి ఆ అబ్బాయిలో వుండటం గొప్ప విషయం అనుకున్నాడు.

"రాఘవా, మంచి ప్రశ్న వేశావురా. విషయాన్నితెలుసుకోవాలన్న జిజ్ఞాస నీలో ఉంది. అది

చాలు. నీ భవిష్యత్తుకి బంగారుబాట వెయ్యడానికి నీకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుంది బాబూ... ఆ నువ్వు అడిగిన ప్రశ్నకి జవాబు చెప్పాలి కదా "

" చెప్పండి మేష్టారూ" ఆసక్తిగా అన్నాడు రాఘవ.

" ఈ పచ్చడి తింటుంటే, ఒకే విధమైన రుచి వుండదు, గమనించావా ?"

" ఔను మేష్టారూ..."

'తీపి, పులుపు, చేదు, వగరు... ఈ రుచుల మిశ్రమమే ఈ ఉగాది పచ్చడి ప్రత్యేకత. ఇది, జీవితానికి అర్థం చెబుతుంది బాబూ ! జీవితం కూడా ఎన్నోరకాల అనుభూతుల మిశ్రమమని తెలియజేసేందుకే ఈ పచ్చడిని అందరూ ఇదేవిధంగా ఈ రోజు తయారు చేసి తింటారు' అంటూ వివరించాడు గోపాలం.

"ఎంతబాగా చెప్పారు మేష్టారు..." సంబరపడిపోయాడు రాఘవ.

రాఘవకి అర్థమయ్యేలా చెప్పినందుకు గోపాలం సంతోషించి ముసిముసిగా నవ్వుకున్నాడు.

" బాబూ రాఘవా, అలా నిన్ను మీ ఇంటి వద్ద దిగవిడిచి బజారికి వెళ్తాను పద నాయనా" అంటూ లేచాడు గోపాలం.

రాఘవ కూడా లేచి నిల్చున్నాడు.

" అన్నపూర్ణా, నేనలా వెళ్లొస్తాను' భార్యతో చెప్పాడు.

" ఇప్పుడెక్కడికండీ ?" అంది అన్నపూర్ణ.

"రాఘవని వాళ్ళింటిదగ్గర అప్పజెప్పి, అక్కణ్ణించి అలా మార్కెట్లోకి వెళ్ళి పిల్లల కోసం కొత్తబట్టలు తీసుకొస్తాను పూర్ణా. చూశావా, మనం అనుకోనిది, వూహించనిది ఎలా జరిగిందో ? ఇదే జీవితం అంటే" సన్నగా నవ్వుతూ అన్నాడు గోపాలం.

అన్నపూర్ణ, తృప్తిగా నవ్వుకుంది.

" వస్తాను అమ్మగారూ" సవినయంగా నమస్కరిస్తూ అన్నాడు రాఘవ.

" నూరేళ్ళు చల్లగా వర్థిల్లు నాయనా" మనస్ఫూర్తిగా దీవించింది అన్నపూర్ణ. ఆమె హృదయం, ఆనందంతో వుప్పొంగిపోయింది. ఆమె నయనాల్లో ఆనందభాష్పాలు గిర్రున తిరిగినయ్.

" రాఘవా, పద బాబూ" అంటూ రాఘవ చేతిని పట్టుకుని బైటకి నడిచారు గోపాలం.

గోపాలం మనసు, ఇప్పుడు ప్రశాంతంగా వుంది. ఆ ఇంట్లో, ఆ రోజు, నిజంగా కొత్త సంవత్సరమే.

□□□

(ఆంధ్రప్రదేశ్, ఏప్రిల్ -2000)